# గమనం

పైకెగసే యెర్రటి ధూళి మేఘాలపైకి నల్లటి పొగని పొట్లాటకు తరుముతున్న పాత రాజదూత్ హేండిల్‌ని గట్టిగా వొడిసి పట్టుకుంటూ ''చెర్లోపల్లె యింకా యెంత దూరం'' అని ప్రశ్నించాడు సుబ్రమణ్యం.

గతుకుల మట్టిరోడ్డులో డబడబలాడుతూ సాగుతున్న మోటార్ బైకుపైన వెనకనున్న యినప కమ్మీని గట్టిగా పట్టుకుని, అదొక సర్కస్ క్రీడలా ముందుకూ వెనక్కూ వూగుతూ ''యిప్పుడు మనమెంత దూరం వచ్చినాము'' అని తానూ ప్రశ్ననే సంధించాడు కోదండం.

''యీ బండి స్పీడో మీటరు ఆడటం లేదు...'' వెనక కూచున్న వ్యక్తికి వినిపించడం కోసం గొంతు పెంచడం చేత సుబ్రమణ్యం మాటలు కీసుకీసుగా వెలువడ్డాయి.

''మైన్ రోడ్డునుంచీ యేడు కిలోమీటర్లని యెస్సయి చెప్పినట్లు గుర్తు. సరిగ్గా పదకొండు గంటలప్పుడు వదిలినాం కదా ఆఫీసును. మైన్‌రోడ్డులో అరగంట వచ్చినాము. యిప్పుడు పన్నెండవుతావుంది. యీ మట్టిరోడ్డులో రెండు మూడు కిలోమీటర్లు వచ్చి వుంటామా మనం?'' గడచిన దూరాన్ని లెక్కబెట్టడం ద్వారా మిగిలిన దూరాన్ని నిర్ణయించడానికి ప్రయత్నించాడు కోదండం.

సూర్యుడు నడినెత్తి మీదికి రావడం చేత, దూరంగా యెర్రటి మట్టిగుట్టలపైన మినమినా యెండమావులు మెరుస్తున్నాయి. అక్కడక్కడా విచ్చలవిడిగా పెరిగిన ముళ్లచెట్లు వడగాలి ధాటికి వూగిపోతున్నాయి. రోడ్డుకిరువైపులా యెర్రటి మెట్ట పొలాల్లో మడకలు సాగిన గుర్తులసలు కనిపించడం లేదు. రోడ్డుకు పడమటి వైపున దాదాపు కిలోమీటరు దూరంలో పోరాటంలో చివరకు మిగిలిన వీరుడిలా పచ్చని పట్టొకటి వొంటరిగా కనబడుతోంది. దారికిరువైపులా అక్కడక్కడా చింత చెట్లు కొన్ని దారి తప్పి నిశ్చేష్టులై నిలిచిపోయిన అనాది ప్రయాణికుల్లా నిలబడిపోయి వున్నాయి.

''జనార్ధనరెడ్డి దగ్గిర కూలింగ్ గ్లాసులు తీసుకునేది మర్చిపోయినాను. కండ్లలోంచీ నీళ్లు కారతా వుండాయి. రోడ్డింత అధ్వాన్నంగా వుంటాదని నువ్వుగూడా చెప్పకపోతివి...'' మిట్టెక్కలేక నీల్గుతున్న బండి గేరు మార్చుతూ సుబ్రమణ్యం నిష్ఠూరపోయాడు.

''అదేదో సామెత చెప్పినట్టు బండిచ్చినోడ్నే కంటెద్దాలు గూడా యిమ్మని అడగలేక పోయినావా...'' అని కాస్సేపు ఆగి, ''యీ రోడ్డిట్ల వుంటాదని నాకు మాత్రం యేం తెలుసు? నేనెప్పుడూ యీ పక్కుండే పల్లెల కొచ్చినోణ్ణి గాదు. అయినా, పెండ్లి గూడా కాని వొయసు కుర్రోడివి. నువ్వే చేతులెత్తేస్తే, మనవరాలు గూడా పుట్టి, తాతగూడా అయిపోయిన నేనేమనాల...'' అంటూ జేబులోంచీ నలిగిపోయిన చేతిగుడ్డను పైకి తీసి బట్టతల పైని చెమటను తుడుచుకోసాగాడు కోదండం.

''తెల్లారితోనే బయల్దేరుంటే యెండ పెద్దగా రాకముందె యింటికి తిరుక్కోని పోయుండచ్చు. వొక్కరోజు, తెల్లారిపూట, ఆఫీసుకుకు పోకపోయినా సీనియరు ధూంధాం అంటాడు. అట్లా అని సాయంత్రమయినా యెగ్గొడదామంటే కుదరదు. శని, ఆదివారాల్లో గూడా ఆఫీసుకు పోవల్సిందే! క్షణం తీరిక లేదు, పైసా ఆదాయం లేదు - అట్లుంది నా ప్రాక్టీసు'' అన్నాడు సుబ్రమణ్యం.

''జూనియరుగా చేరి ఆరేండ్లయినా కాలేదు. అప్పుడే ఆదాయం లేదని బాధపడితే యెట్లబ్బా! సంపాయించే దినాలు ముందుండాయి. ముందు పని నేర్చుకో. సీనియర్ని చూడు. పగులూ రాత్రీ నిద్ర లేకుండా పని చేస్తానే వుంటాడు. సరిగ్గా నిద్ర కూడా పోడు. అందుకే కోర్టులో యింకెవరికీ లేనన్ని ఫైళ్లు మన ఆఫీసులో వుండాయి. యీ మాత్రం పనికే అలసిపోతే యెట్ల నువ్వు?'' అంటూ చెమటతో తడిసిన రుమాలు కొసలు ముడివేసి టోపీలా బట్టతలకు తగిలించాడు కోదండం.

''యీ ఆఫీసుకు పోతే పనొచ్చినట్టే వుందిలే! పొద్దస్తమానమూ కాల్‌వర్కు కోసరమూ, ట్రయల్ వర్కు కోసరమూ యెదురుచూస్తా కోర్టులో కూచునేది తప్పితే, పెద్దాయన ఆర్గ్యుమెంటెప్పుడయినా మనకప్పగిస్తాడా చెప్పు? యీ పాడు ఎల్లెల్బీ బదులుగా బియ్యీడీ చదివి వుంటే స్పెషల్ టీచరుగానైనా సెలక్టయి వుందును. వొకటి రెండేండ్లలో పర్మినెంటయిపోయి వుందును. యీ పాటికెప్పుడో పెండ్లయిపోయి గూడా వుందును'' మోటారు బైకు చేస్తున్న భీకరమైన శబ్దాల మధ్య సుబ్రమణ్యం మాటలు కొన్ని కోదండానికి వినిపించనేలేదు. వినిపించిన మాటలతోనే పూర్తి సంభాషణని వూహించడానికి ప్రయత్నిస్తూ ''యింకా మీ యింట్లో సంబంధాలు చూసేది మొదలుపెట్లేదా'' అని ప్రశ్నించాడు.

''పోయిన సవత్సరమే గదా మా చెల్లి పెండ్లి జరిగింది. అప్పటినుంచీ యేవేవో సంబంధాలు వస్తానే వుండాయి. మా అమ్మ యీ సంవత్సరం పండగ నెల రాకముందే పెండ్లి చేసెయ్యాలని అనుకుంటా వుంది. స్వంతంగా బోర్డు తగిలించినాక గానీ పెండ్లి చెయ్యగూడదని మా నాయన మొండికేసుకుని కూర్చున్నాడు. యేదైనా బాగా యిచ్చే సంబంధమొస్తే పెళ్లి చేసేస్తే తప్పు లేదని మా పెద్దన్న వాదం. మా చిన్నన్నకు యీ

సంగతులేవీ కాబట్టవు...'' అసలే కీచుగా మారిన సుబ్రమణ్యం గొంతు జీరబోవడంతో మరింత చిత్రంగా వెలువడసాగింది.

''మున్సిఫ్ కోర్టుకొచ్చే లాయరు రంగరాజు జూనియరు -శ్రీదేవి కదా ఆమె పేరు - మీ కులవేనంటివి గదా! నీతో గలాంబులాం అని మాట్లాడతాదని విన్నాను. నేనేదో అనుకుంటా వుంటే, ఆమె గబాల్న పెండ్లి పత్రిక తెచ్చి యిచ్చేసిందే...'' అంటూ మెల్లగా తనని చాలా రోజులుగా పీడిస్తున్న అనుమానాన్ని వెలిబుచ్చాడు కోదండం.

''నేను మా యింట్లో వాళ్లకు చెప్పి తీగ కదిలిద్దామని అనుకున్నాను. అయినా, యెన్ని దినాలని వెయిట్ చేస్తుందిలే తాను మాత్రం? పైగా లాయర్ని చేసుకునే దానికి బదులుగా బ్యాంకు క్లర్కును చేసుకుంటే మేలని తెలుసుకొని వుంటుంది...'' పల్లంలో వుచ్చులు తెంచుకుని పరిగెత్తడానికి ప్రయత్నిస్తున్న వాహనం బ్రేకులు నొక్కుతూ వెనుదిరిగి, ''అది సరే గానీ, యీ కేసులో మనం యెంతకు క్లెయిం వెయ్యవచ్చు...'' అని అడిగాడు సుబ్రమణ్యం.

''దినాని కెంత లేదన్నా ముప్పయి రూపాయలు సంపాదించి వుండేవాడు. నెలకు తొమ్మిదినూర్లు సమత్సరానికి కనాకష్టం పదివేలు. ముప్పయి యేండ్లే అనుకుందాం. మొత్తం మూడు లక్షలు. కనీసం రెండున్నరయినా యిమ్మని క్లయిం వెయ్యచ్చు...'' అన్నాడు కోదండం.

''అంటే నేను పది పర్సెంటు ఫీజు అడగొచ్చునా?''

''న్యాయమే! పది పర్సంటంటే యిర్వై అయిదు వేలు. యెంత సాగదీసినా సంవత్సరంలో అవార్డయిపోతుంది. యిట్లాంటి కేసులు సంవత్సరానికి రెండు దొరికినా చాలు. ధైర్యంగా సొంత ప్రాక్టీసు ప్రారంభించవచ్చు. నా నలభై యేండ్ల సర్వీసులో నీ మాదిరి జూనియర్ల నెందర్ని చూళ్లేదు? నేనేమో గుమస్తాగానే మిగిలిపోయినాను. నా కండ్ల మందర ప్రాక్టీసు మొదలుపెట్టిన కుర్ర లాయర్లంతా మేడలూ మిద్దెలూ,కట్టేసినారు...''

''యెప్పుడో వొద్దంటే ఫీజు వొచ్చి పడితిందని యిప్పుడు యెగ జూసుకోనుండమంటావా నువ్వు?'' విసుగ్గా అడ్డు తగిలాడు సుబ్రమణ్యం. ''మా చెల్లి పెండ్లప్పుడు అప్పుచేసి పదివేలు యింట్లో యిస్తేగానీ నా మానం నిలవలేదు. అప్పటికీ అన్నదమ్ముల్లో నేనే తక్కువిచ్చినానని మా అమ్మ గునస్తానే వుంది. అడిగినప్పుడంతా నూర్లుగా, వేలుగా చేతుల్లో పొయ్యకపోతే మా నాయన మూతి ముడుచుకుంటాడు. రోజూ కోర్టుకు పోతా వుండాం కాబట్టి, పోలీసులూ, యెస్సయిలూ సలాం కొడతా వుండారు కాబట్టి, యింట్లో మన అమలు జరగతా వుంది... పోయినసారి గాస్ అయిపోయినప్పుడు మా అన్నా వాళ్లిద్దరూ చేతులు పైకెత్తేసినారు. నేనా ప్రొప్రయిటరు దగ్గరికి పోయి సీనియరు పేరు చెప్తే సిలెండరెత్తించినాడు. యింట్లో అందరూ డంగై పోయినారు...''

చెరువుకట్ట దాటి రోడ్డు మలుపు తిరగ్గానే రెండువైపులా మామిడి తోటలు ప్రత్యక్ష మయ్యాయి. యేడాదికి వొకటి రెండుసార్లు మాత్రమే సాగే కొండవాగుకు జ్ఞాపకచిహ్నంగా

మిగలిన యిసుక మేటలో వాహనం పట్టు దొరక్క గడబిడచేసింది.

''సొంతంగా కేసు తీసుకుంటే సీనియర్‌కు కోపం రాదా'' అని అడిగాడు సుబ్రమణ్యం.

''యెందుకు రాదు? వస్తుంది. నాలుగైదు సంవత్సరాల ట్రైనింగ్ తర్వాత జూనియర్లు సొంతం కేసులు మొదలుపెడతారు. ఫైళ్లు పెంచుకొని సొంత బోర్డు తగిలించుకోవాలని తహతహలాడతారు. యీ సీనియరు గూడా అట్ల పైకొచ్చినోడే గదా! అట్లని యేమీ అనడనుకోవద్దు. వొకే కాంపౌండులో అయిదారు కోర్టులు. ప్రతి కోర్టులోనూ దిక్కుమాలినన్ని ఫైళ్లు. చాలనిదానికి రెండు మూడు బ్యాంకులకు లీగల్ అడ్వయిజరు. యెప్పుడూ ధాటిగా పనిచేసే జూనియర్లు యేడెనిమిదిమంది కావాల. అది ఆయన అవసరం. సందు చూసుకుని జారుకునేది జూనియర్ల అవసరం. యెవుడి అవసరం వాడు చూసుకునేదానిలో తప్పేముంది?...''

పరధ్యానంగా కాస్సేపు వాహనాన్ని నడిపిన సుబ్రమణ్యం, రోడ్డు బాగా మలుపు తిరిగిన తర్వాత నాలుగైదు గుడిసెలు కనిపించగానే బ్రేక్‌పైన కాలు వేశాడు.

''యిదేదో హరిజనవాడయి వుంటుంది. యింకొంచెం ముందుకు పోనీ...'' అన్నాడు కోదండం.

మరో ఫర్లాంగు తర్వాత పెద్ద పసుపు పచ్చ డబ్బా రేకు బోర్డుపైన ''చెర్లోపల్లె'' అన్న అక్షరాలు కనిపించాయి. మొదట పెద్ద వేపచెట్టూ, దాని చుట్టూ రచ్చబండా, రోడ్డుకిరువైపులా రకరకాల పూరిండ్లూ, అక్కడక్కడా వొకటి రెండు బండ్ల మిద్దెలూ, రోడ్డు మధ్యలోనే చిన్న భజన మందిరం, వూరికి రెండు సరిహద్దుల్లా రెండు బోరింగులు, బోరింగుల దగ్గర ఆడవాళ్ల సందడి...

వాహనం వూరిలో పెళ్లినడక నడుస్తూ సాగుతుండగా ''సార్... సార్...'' అంటూ కేక వినిపించింది.

వొక పూరింటి ముందు, పందిరి కింద, నులకమంచంపైన కూర్చున్న పోలీసు పైకి లేచి నిల్చుని, కుర్ర లాయర్ అన్న విచక్షణ లేకుండా సెల్యూట్ చేస్తున్నాడు.

''యెస్సయి అమీర్ సాహెబ్ యిట్లాంటి కేసుల్లో ఎత్తిన చెయ్యని చెప్పినాను కదా! కానిస్టేబుల్ని మనం చెప్పిన టయానికంతా ఎట్ల పంపించినాడో చూడు.'' వెనుక సీట్లోంచి కిందికి దిగి దూకుతూ సుబ్రమణ్యానికి మాత్రం వినిపించేలా గొణిగాడు కోదండం.

తానూ కిందికి దిగి మోటారు బైకును పందిరి కిందికి తోసి స్టాండు వేశాడు సుబ్రమణ్యం.

''నువ్వా సంజీవి నాయుడూ! వచ్చి చానా సేపయ్యిందా?'' దగ్గరికొచ్చి మంచంపైన కూర్చుంటూ కోదండం పోలీసును పలకరించాడు.

చెమటతో తడిసినా, బింకం వదలని కాకీ దుస్తులకూ, సన్నటి సంజీవి నాయుడి ఆకారానికి పొత్తు కుదరడం లేదు. వొత్తయిన అతడి జుట్టుపైన శాశ్వతంగా నిలిచిపోయిన

నొక్కు టోపీతో తనకున్న నిరంతర సాహచర్యాన్ని చెప్పకనే చెబుతోంది. డైరీనీ, టోపీనీ మంచంపైనుంచి తీసి చేతిలో వుంచుకునీ దిన్నెపైన కూర్చుంటూ, ''కూర్చోండి సార్! నేను పొద్దున యెనిమిది గంటల బస్సులో వస్తిని. బస్సులో జనాన్ని కుమ్మేసినార్లెండి. నేను టాపుపైన కూర్చొని వస్తిని. అది నన్ను పదిగంటలప్పుడు క్రాసులో తోసేసి పోయింది. అక్కడినుంచీ జనతా సర్వీసులో యిక్కడి కొచ్చినాను'' జరిగినదంతా మరపురాని మధురానుభూతయినట్టుగా పరవశించిపోతూ చిరునవ్వు నవ్వుతున్నాడు సంజీవి నాయుడు.

అతడివైపు తిరిగైనా చూడకుండా మంచంపైన కూచుంటూ ''యిదేనా యిల్లు'' అని అడిగాడు సుబ్రమణ్యం.

''అవును. మా యెస్సయి వొక లాయరూ, వొక గుమస్తావస్తారని చెప్పినప్పుడు యెవురో అనుకొంటిని సార్. మీ పేరు చెప్పుంటే నేరుగా మీ ఆఫీసుకాడికే వచ్చేసుందును. ఆ రాజ్‌దూత్ ముగ్గుర్ని లెక్కబెట్టకుండా లాగేస్తింది కదా! మనం కలిసే వచ్చుండచ్చు...''

సంజీవి నాయుడు మాటలు వింటూ యింటిని పరీక్షించి చూశాడు సుబ్రమణ్యం. బాగా కిందికి దించిన పూరికప్పు కింద దాదాపు మూడడుగుల పొడవున్న గోడలు. వీధి తలుపుకిరువైపులా మట్టి దిన్నెలు. దిన్నెలపైన తలుపునకు రెండు వైపులా రెండు కిటికీలు. కిటికీలకున్న కొయ్య వూసల్లో అక్కడొకటీ అక్కడొకటీ రాలిపోయి వున్నాయి. తైల సంస్కారం లేని దుబ్బు తలతో ముఖం వేలాడేసుకున్న పూసల కుర్రాడి ముఖంలా చిత్రంగా కనిపిస్తోంది ఆ యిల్లు.

''యింట్లో యెవరూ లేరా'' అని ప్రశ్నించాడు సుబ్రమణ్యం.

''లేక యెక్కడికి పోతారు సార్? యిదేమీ పనుల కాలం కాదు గదా!'' సంజీవినాయుడు సరాయించాడు.

''అయితే, సడీ చప్పుడు లేదే!'' అంటూ సుబ్రమణ్యం విసుక్కున్నాడు.

''నేనే బయటికి అంపించినాను సార్. మన పెద్ద పీరా సాయిబుకు వూరికీ యెగువన కొండకింద యెకరా చేనుంది. సమత్సరానికి యెంత లేదన్నా పదిమూట్ల శెనిక్కాయ లొస్తాయి. ఆడనే అయిదారు తాటిచెట్లుండాయి. యెండలో వచ్చే సరికి వొళ్లు హూనమై పోయింది గదా! రెండు వొంబాల తాటినుంజులు కొట్టుకోని రమ్మని చెప్పినాను. మనిషి పోయి గంట దాటతా వుంది. యీపాటికి తిరుక్కోని వస్తావుంటాడు లెండి'' అన్నాడు సంజీవినాయుడు.

''పెద్ద పీరా సాహెబు అదీ పేరు! కర్కెక్టే! నీకు బాగా పరిచయమేనా నాయుడూ?'' యీసారి కోదండం ప్రశ్నించాడు.

''యెందుకు తెలియదు సార్! బాగా తెలుసు. నాల్గైదేండ్లుగా పని పడినప్పుడంతా నన్నే యీ వూరికి పంపిస్తా వుండాడు మా యెస్సయి. నాకు బాగా చుట్టమైపోయినాడులే యీ సాయిబు బూబమ్మ గూడా గుట్టయిన మనిషి'' అంటూ యింటి ద్వారం వైపుకు తిరిగి

''బూబమ్మా! పెద్ద చెంబుతో నీళ్లు తే! సారోళ్లొచ్చినారు'' అని కేకేశాడు.

అయిదారు నిమిషాల నిరీక్షణ తర్వాత యింటి లోంచి బయటికొచ్చిందామె. చెవులకున్న పోగుల్ని స్పష్టంగా కనిపింపజేసేలా బుగ్గలు లొత్తలు పడ్డ కోల ముఖం, సూనికి పైగా నెరిసిన వెంట్రుకలు. వెలిసిన చీర. శరీరంలో కండ తక్కువై యెముకల శాతం పెరగడం చేత ఆమె తాటాకు బొమ్మలా కదలాడుతోంది.

పెద్ద చెంబు నీళ్లని యిద్దరూ కాళీ చేసేశాక, ఖాళీ చెంబు నెత్తుకుని యింటిలో కెళ్లిపోయిందామె.

''యిప్పుడు చెప్పు నాయుడూ! యీ కేసు నీకు బాగా తెలుసునంటివి కదా'' అని అడిగాడు కోదండం.

''మీకు తెలియదా సార్!'' యింకా బింకంగానే అన్నాడు సంజీవి నాయుడు.

''తెలియదనే కదా అడిగింది. పోయిన వారం యింట్లోనే కలిసినాంలే మీ యెస్సయిని. కేసులేమీ లేవని మా లాయరు - యీయనే, పేరు సుబ్రమణ్యం - భలే డీలా పడిపోయినాడు. అప్పుడే యీ కేసు సంగతి చెప్పినాడు మీ యెస్సయి. యింకా కొంచెం కొత్త కదా! పని నేర్చుకునే దాకా కొంచెం తోడు రమ్మంటే నేనూ వచ్చినాను. వివరాలడిగితే చెప్పే తీరిక మీ యెస్సయి కెక్కడుంది? పేరూ వూరు మాత్రం చెప్పినాడు. క్లయింటు దగ్గర ఆయన పేరు చెప్తే మిగిలిన వివరాలన్నీ అతనే చెప్తాడని హామీ యిచ్చినాడు. యెప్పుడు పోతారని అడిగినాడు. యీ ఆదివారమేనంటిమి. అయితే, తెల్లారితో మా జవాన్ను గూడా పంపిస్తానని చెప్పినాడు. చెప్పిన వాటం చూసి యీ సంగతి మరచిపోయే వుంటాడని అనుకున్నాను. యెట్టనో గవనం పెట్టుకోని నిన్ను పంపించినాడు...'' అన్నాడు కోదండం.

''మా యెస్సయిసారు అట్లా మరచిపోయేవాడు కాదు సార్! మాటంటే మాటే! అట్ల లేకుంటే పదేండ్లుగా, యీ యిలాకాలో వుండే అయిదారు పోలీస్టేషన్లలో, వొకదాన్నుంచీ ట్రాన్స్ఫరొస్తే యింకొకదానికి మారతా యిక్కడే సెటిలయి పోయి వుండునా? యీ యేరియాలో ఆయనకు తెలియకుండా పోయిన ఆక్సిడెంటు వొకటయినా చూపించండి మీరు?''

''పెద్ద పీరా సాహేబు. అదీ క్లయింటు పేరు. మిగిలిన వివరాలు చెప్పు'' నాయుడి మాటలకు విసుగ్గా అడ్డు తగిలాడు సుబ్రమణ్యం.

''లాయరంటే అట్లుండాల! క్షణం వృథా చెయ్యగూడదు. కోర్టులో రెండుమూడుసార్లు మీరు బైలు కోసరం మేజిస్ట్రేట్టు దగ్గరికి తిరగతా వుంటే చూసినాను సార్! భలే చురుగ్గా తిరగతారు మీరు. అట్లుంటే చాలు. నాలుగైదేండ్లలో పెద్ద లాయరై పోతారు. నాదీ హామీ...'' సంజీవి నాయుడు యింకా ముగ్గులోకి దిగలేదు.

''నువ్వూ సామాన్యమైనవాడి కావని నాకు తెలుసులే నాయుడూ! మీ యెస్సయి మాదిరిగా నువ్వుగూడా యీ యేరియాలోనే సంవత్సరాల తరబడీ బైఠాయించినావు

కదా! యీ కేసును మొదటినుంచీ నువ్వే హేండిల్ చేసి వుంటావు...'' అది పొగడ్తో, విమర్శో అర్థం కానివ్వకుండా వొక రకమైన వంకర నవ్వును ప్రసారం చేశాడు కోదండం.

తానూ అతడికి ధీటయిన నవ్వొకటి నవ్వి ''అందుకే గదా నన్ను అంపించింది యెస్సయి...'' అంటూ కొనసాగించాడు సంజీవి నాయుడు. ''యీ ఊరికీ కోర్టుకూ తిరిగీ తిరిగీ వివరాలన్నీ నోటికొచ్చేసినాయి. ఆక్సిడెంటయింది యెనభై అయిదులో. యీ పెద్ద పీరా సాయిబుకు వొకడే కొడుకు. వీళ్లకొక ఆవునింది అప్పుడు. దినానికి యేడెనిమిది లీటర్ల పాలిచ్చే జెర్సీ ఆవది. తెల్లారక ముందే లేచి, పాలు పిండుకొని, క్యాన్లో పోసుకొని, క్రాసుకాడికి సైకిల్లో పోయేది వాని డ్యూటీ. పాల వాన్ క్రాసు కొచ్చినాక, పాల క్యాను దానిలోకెక్కించి, ఖాళీ క్యానుతో యింటికొచ్చేవాడు. డేట్ గూడా గుర్తే నాకు...''నాయుడు వొకటి రెండు నిమిషాలు ఆగి, మనసులోనే లెక్కలు గట్టి తర్వాత చెప్పసాగాడు. ''తొమ్మిదో తేదీ, యేడో నెల, వెయ్యిన్నీ తొమ్మినూటయెనభై అయిదు. ఆ పొద్దు తెల్లారి సైకిల్లో పోతావుంటే ట్రాక్టరు కొట్టేసింది. స్పాట్ డెడ్. ఆ సమయంలో నడిపినోడికి డ్రైవింగ్ లైసెన్సు లేదు. అదీ తగరారు. అప్పుడు యిప్పుడున్నట్టుగా యీ యిన్సూరెన్సు కేసుల కోసం యెగచూసే లాయర్లు అంతగా లేరు. నెల్లూరునుంచి యెవరో లాయరు యింతదూరం వచ్చి వకాలత్తు దాఖలు చెయ్యించినాడు. యింతదూరం ప్రతిసారీ రావాలంటే కుదరదు కదా! మన చిత్తూరులో యింకో లాయర్ని తనకు పార్టనర్‌గా పెట్టుకొని ఆయన ద్వారా కేసు నడిపించినాడు. పెద్ద పీరా సాయిబు కొడుక్కు చచ్చిపోయేదానికి ఆర్నెల్లు ముందు పెండ్లి గూడా అయింది. తల్లీ, తండ్రీ, భార్యా, మొత్తం ముగ్గురూ డిపెండెంట్లు. యెంత లేదన్నా యింకా ముప్పయి నలభై యేండ్లు సంపాయించి పోషించి వుండేవాడు. కాబట్టి అప్పటి లెక్కల్లో లక్షయినా యివ్వాలని యిన్సూరెన్సు కోసేసినారు. యేమాటకామాటే చెప్పాల్లెండి సార్! భలే కష్టపడి తిరిగినాడు మన చిత్తూరు లాయరు గూడా! లాయర్ శ్రీనివాసులురెడ్డి పేరు మీరు గూడా వినే వుంటారు. ఆయనే యీ కేసేసింది. ఆక్సిడెంటయినప్పుడు డ్రైవ్ చేసినోడు వేరేవాడనీ, వాడికి లైసెన్సుందనీ ప్రూవ్ చేసినాడు. కాయ పండతా వుండేటప్పుడు యేదో కిరికిరీ జరిగింది. కేసు అవార్డయ్యే దినాల్లో ఆ లాయరెందుకో పట్టించుకోలేదు. పెద్ద పీరా సాయిబు కూడా ఆ పక్కకు తిరిగి చూల్లేదు. జడ్జి డిస్మిస్డ్ ఫార్ డీఫాల్ట్ కింద కేసు కొట్టేసినాడు. అదీ జరిగిన సంగతి... యిదే కేసుపైన క్రిమినల్ కేసు గూడా జరిగింది. డ్రైవరుకు ఫైనేసినారు. ఆ వెయ్యో రెండువేలో గ్గూడా యీ యిన్సూరెన్సు కేసు ఖర్చుల కిందే దఖలయిపోయిందని సాయిబు చెప్పినాడొకసారి...''

''కొట్టేస్తే యేమయిపోయింది? మళ్లా రెస్టోర్ చేసుంటే సరిపొయ్యేది గదా! యిప్పుడు పెద్ద పీరా సాయిబేమంటాడు? మేము వస్తామనే సంగతయినా చెప్పినావా లేదా నువ్వు?...'' కోదండం అలవాటు ప్రకారం మరోసారి విసుక్కున్నాడు.

''పనుందని చెప్పినాను లెండి. యీపాటికి వచ్చేసుండాల. దారిలో యేదయినా పని బడి ఆగినాడేమో. వస్తాడ్లెండి, రెడ్ హాండెడ్‌గా పట్టుకుందురుగానీ...'' అంటూ నాయుడు

జేబులోంచీ బీడీ పైకిలాగి, వెలిగించి, గుప్పుగుప్పున వదలసాగాడు.

కోదండమొకసారి అతడివైపుకు వురిమి చూసి, మంత్రాలు చదువుతున్నట్టుగా తనకు మాత్రమే వినిపించేలా రెండు బూతులు గొణిగి, తానూ సిగరెట్టు రగిలించాడు.

సుబ్రమణ్యం డైరీలోంచి తల పైకెత్తి ''సాయిబుకు బిడ్డలెందరు'' అని అడిగాడు.

''వొకడే కొడుకు. వొక కూతురు. ఆ పిల్లకెప్పుడో పెళ్లయిపోయింది. మనవడికి వొడుగులు జరిగిందీ మధ్య. వెయ్యిదాంకా చిలుం వదిలిపోయిందని సాయిబు చెప్పినాడు'' అన్నాడు నాయుడు.

''సాయిబుకు వొక యెకరా చేనుంది అంతే గదా! యింకేముంది ఆదాయం?'' మరో సందేహాన్ని వెలిబుచ్చాడు సుబ్రమణ్యం.

''ఆ చేన్ను మాత్రం నమ్ముకుంటే సంసారం జరిగినట్టే! సాయిబు చింతగింజల యాపారంలో పడి లేసినోడు. వొకప్పుడైతే రెండు మూడు లోడ్లు కొని మారు బేరానికి అమ్మతా వున్నాడు. యిప్పుడు వయసైపోయింది గదా! అయినా యేదో కొంచెం చిల్లర ఖర్చులకయ్యేటట్లుగా యాపారం చేస్తానే వుంటాడు. సీజనయినాంక చింతపండు తట్టైత్తుకోని నెల్లూరు కాపక్కుండే పల్లెలకు పోయి అమ్ముకొనొస్తాడు...'' మాట్లాడుతున్న వాడల్లా ఆగి ''చూసినారా! పెద్ద పీరా సాయిబుకు నూరేండ్లు. మాటల్లోనే వచ్చేసినాడు'' అంటూ వీధివైపుకు చేయి చాపాడు నాయుడు.

రెండు మూడు తాటికాయల వొంబాళ్ని నెత్తిపై కెత్తుకుని వస్తున్న పెద్ద పీరా సాయిబు నడుస్తున్న తాటిచెట్టులా కనిపిస్తున్నాడు. నల్లటి తాటికాయల రంగుతో అతడి వొంటిరంగు కూడా దాదాపు కలిసిపోయి వుంది. మోకాళ్ల వరకూ పైకెత్తి కట్టుకున్న చిరుగుల గళ్లలుంగీలో కూడా నలుపురంగే యెక్కువగా వుంది. పాత పాలిస్టర్ చొక్కాలోంచీ చేత్తో అల్లిన నూలు బనీను సుస్పష్టంగా కనబడుతోంది. మోపును కిందికి దించుతుండగా జారిన తలగుడ్డ కింద చెమటతో అతుక్కుపోయిన వెంట్రుకలు బట్టతలని పూర్తిగా కప్పలేక పోతున్నాయి.

నాయుడు తానే బూబమ్మని కేకేసి, మంచినీళ్లు తెచ్చిపెట్టమని, తన జేబులోంచి బీడీ తీసి సాయిబుకిచ్చి ''ముందు రెండు దమ్ములు కొట్టు సాయిబూ'' అంటూ తన వుదారతను చాటుకున్నాడు.

సాహెబు పందిరి గుంజకానుకుని చతికిలబడ్డాడు. గంట కొట్టడం కోసం గడియారంలోంచీ వెలుపలికొచ్చే మరబొమ్మలా మంచినీళ్ల చెంబుతో బయటికొచ్చిన బూబమ్మ తన పని కాగానే ఖాళీ చెంబుతో లోనికెళ్లిపోయింది.

నాయుడు గుడిసె పక్కకెళ్లి, కట్టెల గుంపులోంచీ లావైన తుండునొకదాన్ని తీసుకొచ్చి సాహెబు ముందు వేశాడు.

సుబ్రమణ్యం చేతిగడియారం కేసి చూసుకున్నాడు. గంట వొకటిన్నర దాటుతోంది. బిక్షం కోసం యిల్లిల్లూ తిరుగుతున్న ముసలి బిక్షగాడిని మినహాయిస్తే వీధంతా

నిర్మానుష్యంగా వుంది. బోరింగు దగ్గర మాత్రం వొకరిద్దరు ఆడవాళ్ల బిందెల్లో నీళ్ల నింపుకుంటున్నారు.

బీడీ పని ముగించాక, సాహేబు తుండుపైన వొంబానన్నుంచి, వొకటొకటిగా తాటికాయల్ని కొట్టసాగాడు.

మొదటి కాయను చేతికందుకుని, బొటనవేలిని నుంజులోకి జొనిపి, అలాగే జుర్రున పీలుస్తూ ''సార్‌వాళ్ల నీ కోసరమే వచ్చినారు సాయిబూ! యీయనే లాయరు. యీయన వాళ్ల గుమాస్తా. కేసు మల్లా అప్పీలు చేస్తారంట...'' అంటూ పరిచయం చేశాడు నాయుడు.

సాహేబు చేస్తున్న పని నలాగే ఆపి కత్తిని పక్కనపెట్టి, సవకంతొ ముఖం తుడుచుకుని, రెండు చేతులూ జోడించి, ''సలాం సార్! యింక ఆ మాట మాత్రం నాముందర చెప్పొద్దండి'' అనేశాడు.

అతడికేసి వొకటి రెండు నిమిషాలు సూటిగా చూసి, ''నీ యింటికి వెతుక్కుంటూ వచ్చి డబ్బులు తీసిస్తామంటే భలే గిరాకీ చూపిస్తావేందయ్యా నువ్వు? నీ యవ్వారం విడ్డూరంగా వుందే! దుడ్డంటే చేదా'' అంటూ కోదండం విసుక్కున్నాడు.

''దుడ్డొస్తిందని నమ్మి నాలుగైదేండ్లు అదేపనిగా కోర్టు చుట్టూ తిరిగీ తిరిగీ నా చావు సదరమైపోయింది సార్'' పెద్దగా నిట్టూర్చి సాహేబు వివరించసాగాడు - ''నెలకొక సారయినా ఆఫీసుకాడికి పొయ్యి తంచనుగా పెద్ద లాయరుకు కనిపించినాను. పోయినప్పుడంతా నూర్లనూర్లుగా ఆయనకు చదివించినాను. యెప్పుడైనా వొక నెల పోలేకపోయినప్పుడు కొంపంతా మునిగిపోయినట్టుగా ఆయన తిడతావుంటే, కిక్కురుమనకుండా భరాయించినాను. కేసేమో యెంతకూ తెగలేదు. నెలలు జరిగిపోయె. యేండ్లు కూడా జరిగిపోయినాయి.యీ మధ్య కాయకష్టం చేసి తినీ తినకుండా నేను మిగలబెట్టిన దుడ్డెంత ఖర్చయిందో లెక్కే లేదు. వొట్టి చేతుల్తో మూరేయించే దాంట్లో కోర్టోళ్లని మించినోళ్లు లేరు. యింక వోపిక లేదు సామీ నాకు. కావాలంటే మీరూ రెండు తాటికాయలు తినేసి పొండి. కేసుమాట మాత్రం యెత్తద్దు...'' సాహేబు మరో తాటికాయను నరికి సుబ్రమణ్యం ముందు చాపాడు.

కోదండం తాటికాయను తన చేతికి తీసుకుని నుంజును జుర్రుకుంటూ ''యీ లాయరు అట్టాంటోడు కాదులే సాయిబూ! ఆరు నెలల్లో నీకు యిన్నూర్రెన్పు దుడ్డు తీసియ్యకపోతే అప్పుడడుగు'' అన్నాడు.

సాహేబు రెండు అరచేతులూ ముందుకు చాపి, ''అదేమన్యాయమో, నేను లాయరు దగ్గిరికి పోయినప్పుడంతా వాళ్ల బాయికేసిన మిషినీ పాడైపోయే వుంటింది. లేకుంటే కరెంటయినా పొయ్యుంటుంది. వాళ్లింట్లో నీళ్ల చేందీ చేందీ నా రెండు చేతులూ కాయలు గాసిపోయినాయి సార్'' అన్నాడు, జీరబోయిన కంఠంతో.

రెండో తాటికాయ కోసం చేయి చాపుతూ, ''నా మాట కొంచెం విను సాయిబూ''

అంటూ కోదండం గొంతు సవరించుకున్నాడు. ''యీ కేసులకంతా ప్రాయంలో వుండే లాయర్లే లాయకీ. యిప్పుడు మా లాయరైనా దుడ్డు కోసరం యీ కేసు తీసకోవాలని అనుకోవడం లేదు. కేవలం యెక్సుపీరియన్సు, అంటే అనుభవం కోసరం యీ కేసు చెయ్యాలని అనుకుంటా వుండాడు. నువ్వేమో తొలీ తడవ బురదలోకి అడుగు పెట్టినావు. యిన్సూరెన్సు కేసెక్కడ పోతిందిలే అని పెద్ద లాయరు తాత్సారం చేసుంటాడు. పెద్ద పెద్ద కేసుల యవ్వారాల్లో పడి పెద్దగా పట్టించుకోనుండడు. యేనుగు మీంద పొయ్యేవాణ్ణి సున్నమడగతారా యెవురైనా? యీ కేసును పెద్ద లీడింగు లాయరు దగ్గిరికి తీసుకొని పోయినావు చూడూ, అదీ నువ్వు చేసిన తప్పు...''

''యేది తప్పో, యేది కాదో నాకేం తెల్సును సార్!'' మరోసారి చేతులు జోడించాడు సాహేబు. ''అయినా, నేను లాయరు దగ్గిరకెక్కడ పోయినాను? చెట్టంత కొడుకును పోగొట్టుకుని మేము కుమిలిపోతావుంటే, యెవుడో పోలీసాయిన వకీలొకాయనను యెంటబెట్టుకుని చక్కా వచ్చినాడు. కేసేస్తే యిన్సూరెన్సు దుడ్డు వేలకు వేలు వస్తాదని ఆశ జూపించినాడు. మా ఆడోళ్ల ఆ పాపిష్టి దుడ్డు వద్దేవద్దని చెప్పనే చెప్పింది. బతికినన్నాళ్లూ దొర మాదిరి బతికినాడు మా బిడ్డ. వాని రెక్కల కింద మా ముసిలి బతుకులు తెల్లారి పోతాయని అనుకొంటిమేగానీ, కనుమరుగైనాక గూడా మాకొక దోవ చూపిస్తాడని మేమను కోలేదు. అయినా గోరీల్లోకి పోయేదాకా బతకాలగదా? ఆశపడినాను. కోర్టుపనిపైన టౌనుకు పోయినప్పుడంతా మా ఆడోళ్లని పట్టతరమయ్యేది గాదు. యిప్పటికీ యిప్పుడో యింకొంచెం సేపుటికో మావాడొచ్చి పలకరిస్తాడనే అనిపిస్తావుంటింది మాకిద్దరికీ. వొద్దుసార్ వొద్దు. యీ అగసాట్లు వొద్దు. వుండేదిద్దరు జీవాలం. యింకా కొంచెం సత్తవ మా యీ చేతల్లో మిగిలే వుండాది. యెట్లనో వొకట్ల బతక్కపోము...''

సాహేబు కళ్లలో నీళ్లు తిరగడం చూసి బెంబేలు పడిపోతూ కోదండం కేసి అసహాయంగా చూశాడు సుబ్రమణ్యం.

అభయహస్తం చూపుతున్నట్టుగా చిరునవ్వు నవ్వి, కోదండం సాహేబు కేసి తిరిగాడు - ''చూడు సాయిబూ! నువ్వు మొదుటిసారి కష్టాలు పడినావు. యీసారి గూడా ఆమాదిరే జరగతాదని అనుకుంటావుండావు. అది నీ తప్పు కాదు. కాలమట్లుంది. కానీ, మేము అలాంటోళ్లు గాదు. వకాలత్ కాగితంపైన వేలిముద్ర వేసేది మాత్రమే నీ వంతు. పైసా నువ్వు మాకియ్యాల్సిన పని లేదు. కోర్టు ఖర్చులకు గూడా యేమీ యియ్యద్దు. అనుభవం కోసరం మా లాయరు యీ కేసు చెయ్యాలని అనుకుంటా వుండాడని చెప్పినాను గదా! అంతా ఆయనే భరిస్తాడు. యెప్పుడు కోర్టుకు రావాల్సి వుంటే అప్పుడు కార్డేస్తాము. టౌనుకు రా. నీకు వచ్చిపోయేదానికి చార్జీలు గూడా ఆయనే భరాయిస్తాడు. దుడ్డు సాంక్షనయినాక నీకెంత యియ్యాలని అనిపిస్తే అంతియ్యి. గోజారితే వొట్టు. నీ దగ్గిర పైసా ఖర్చు పెట్టియ్యము. అదీ షరత్తు. దీనికీ పోలీసాయనే సాక్ష్యం'' అంటూ నింపాదిగా విశదీకరించాడతను.

టెంకలు మాత్రం మిగిలిన తాటికాయల్ని కత్తితో వో వైపుకు తోస్తూ పెదవి విరిచి

''మీరేమో చెప్తా వుండారు గానీ, నాకెందుకో ముగసాటం లేదు సార్!'' అన్నాడు సాహేబు.

''చచ్చిపోయినాకగూడా నీ కొడుకు దారిచూపించినాడని అంటివి కదా! యిప్పుడొద్దంటే నీ కొడుకు ఆత్మకు శాంతి కలుగుతుందా?'' అన్నాడు సుబ్రమణ్యం.

''కేసు వెయ్యమనేదీ, వొద్దనేదీ అంతా నీ యిష్టమేనా సాయిబూ!'' ప్రేక్షక మాత్రుడిగా మిగిలిపోవడం తన బాధ్యత కాదన్నట్టుగా సంజీవి నాయుడు గొంతు సవరించుకున్నాడు. ''యీ యవ్వారంలో పెద్దపెద్ద తలకాయలుండాయి. నువ్వొద్దంటే ఆగిపోయే దానికి వాళ్లేమీ అల్లాటప్పా వాళ్లు కాదు. వొకసారి రికార్డు కెక్కినాక యింకెవరూ ఆపలేరు...''

అతడివైపుకుచూసి ప్రసన్నంగా వొక చిరునవ్వు నవ్వి ''సంవత్సర సంవత్సరానికీ రూల్సు మారతావుండాయి సాయిబూ! యిప్పుడు ముందు మాదిరిగా కేసులు పెండింగ్‌లో వుండటం లేదు. వొకసారి కోర్టుకురా నీకే తెలస్తాది. యెందురు లాయర్లు! యెన్ని కోర్టులు! అందులో యీ మాదిరి కాంపన్సేషన్ కేసులయితే బిన్నాగా ముగించేయాలని పైనుంచీ ఆర్డర్లొచ్చినాయి'' అన్నాడు కోదండం.

''నువ్వెయ్యాల్సిందొక వేలిముద్ర. ఆపైన నీకేమీ కష్టం కలగనియ్యమని సార్ చెప్తా వుండాడు కదా! యింకా మినకరిస్తావేంది నువ్వు?'' అంటూ తానే పైకి లేచి, పేనా తీసి సాహేబు ముందుకు చాపాడు సంజీవినాయుడు.

కళ్లల్లో నీళ్లు గిర్రున తిరుగుతుండగా పెద్ద పీరా సాహేబు యింకు రాసుకుని వకాలత్తు కాగితంపైన ముద్రవేశాడు.

''ఆ కాగితంపైన నీ భార్య దగ్గర గూడా వేలిముద్ర వెయ్యించు సాయిబూ'' అన్నాడు కోదండం.

సాహేబు యింటిలోకెల్లి బూబమ్మ వేలిముద్ర వేయించుకొచ్చాడు.

సుబ్రమణ్యం తటపటాయిస్తూ అటూయిటూ కలయజూసి ''చిన్న డౌటు సాయిబూ! నీ కోడలు గూడా మీతోనే వుందా'' అని ప్రశ్నించాడు.

సాహేబు నిలువునా దిన్నెపైన కూలిపోయి, అరిచేతుల్లో ముఖం దాచుకుని ''ఆ మాటెందుకు అడగతావు సార్! మావోడు పోయిన సమత్సరమైనా తిరక్కముందే అది మారు నిఖా చేసుకునేసింది గదా!'' అని ముక్కు చీదుకున్నాడు.

వొకటి రెండు నిమిషాల సేపు సుబ్రమణ్యం నిశ్చేష్టుడై వుండిపోయాడు.

''యిప్పుడామె యే వూళ్లో వుంది?'' అని అడిగాడు కోదండం.

''యాడనో వుంటే బాగనే వుండును సార్!'' జీరబోయిన గొంతుకతో సాహేబు చెప్పసాగాడు. ''యీడినుంచీ, యిదే దోవన యెగబడిపోతే మైలు దూరంలో గవర్మెంటోళ్లు కట్టించిన యిండ్లుండాయి. యెక్కడా గూడు లేనోళ్లు కొందురాడ కాపురాలు పెట్టేసినారు. యీమద్దనే అదికూడా అక్కడే సంసారం బెట్టేసింది. చాలని దానికి టింగురంగా అని రెండు దినాల కొకసారి కట్టెల మోపెత్తుకోని మా యింటిముందునుంచే

నడిచిపోతింది...''

కోదండం పైకి లేచి నిల్చుని ''ఆమె పేరు చెప్పు సాయిబూ! అన్నట్టు యీ మొగుడేం పని చేస్తాడు?'' అని అడిగాడు.

తాటి టెంకల్ని తలపైకెత్తుకుని, యింటి వెనకనున్న పెరటివైపుకు నడుస్తూ తిరిగైనా చూడకుండా ''హుసేనమ్మ. వానిపేరు దస్తగిరంట. నాకింకేమీ తెలియదు...'' అని చెప్పాడు సాహేబు.

మళ్లీ వొకసారి యింటినంతా కలయజూసిన తర్వాత , సుబ్రమణ్యం పందిరి బయటికొచ్చి మోటార్ బైకు స్టాండును లాగి దానిపైకెక్కి కూర్చున్నాడు. నాయుడు దగ్గరగా వచ్చి నిల్చున్నాడు. కోదండం వాహనం వెనకవైపున కూర్చుంటూ ''మంచిది నాయుడూ! మా కోసరం చానా శ్రమ తీసుకున్నావు. థాంక్సు. మేమిద్దరమూ వొకసారి హుస్సేనమ్మను గూడా పలకరించి వస్తాము. అన్నట్టు గంట రెండవతా వుంది. భోజనం చేసి వచ్చినావా లేదా?'' అని ప్రశ్నించాడు.

''యింక తిండెందుకు సార్! సాయిబు పుణ్యమా అని కడుపునిండా నుంజులుండాయి. సాయింత్రం దాకా యీ బండికి ఆయిల్ పన్లేదు. క్రాసు దాంకా కాలూ కాలూ కొట్టుకుంటా నడిచినానంటే బస్సో, ట్రాక్టరో యేదో వొకటి దొరికితింది. మొరవపల్లెలో కొంచెం పనుండాది. ఆ పనిగూడా చక్కబెట్టినాకే వూళ్లో అడుగు పెట్టమని మా యెస్సయి ఆర్డరేసినాడు. యేవేళకు యింటికి చేరతానో నాకే తెలియదు. యేం ఫరవాలేదు లెండి. దినాల తరబడీ కంటికి కనబడక పోయినా మావోళ్లేం గుంజాటన పడరు. అలవాటయి పోయింది కదా...'' సంజీవినాయుడు నవ్వుతూనే వున్నాడు.

కోదండం సుబ్రమణ్యం వైపుకు వొంగి ''పదో యిరవయ్యో నాయుడుకియ్యి. మన కోసరం వచ్చినప్పుడు చార్జీలకయినా యియ్యాల్సిందే కదా!'' అన్నాడు.

సుబ్రమణ్యం జేబుల్లోంచీ రెండు యిరవై రూపాయల నోట్లు తీసి నాయుడు చేతికిచ్చాడు.

''యింతటితో అయిపోలేదులే నాయుడూ! నీ కష్టం మరిచిపొయ్యేవాడు కాదులే ఖా లాయరు'' అని సుబ్రమణ్యం భుజం చరుస్తూ ''బయల్దేరుదాం'' అని హెచ్చరించాడు కోదండం. వాహనం కొంచెం ముందుకు నడిచిన తర్వాత మళ్లీ తానే పెదవి కదిపాడు. ''యీ పొద్దుటినుంచీ కేసు మొదులైపోయినట్టు లెక్క. వకాలత్తులో పార్టీ ముద్ర వేసేసినాడు. పొద్దన బండిలో పోసిన లీటరు పెట్రోల్ను మొదటి ఖర్చు. యిప్పుడు నాయుడికిచ్చింది రెండో ఖర్చు. అన్ని వివరాలు డైరీలో నోట్ చేసుకునేది మరువద్దు. యిది ఆరంభం మాత్రమే! ఆఫీసుల్లో పనులు కదలాలంటే ఖర్చులుంటాయి. మన కోసరం పనులు చేసినోళ్లని వూరికే పంపిస్తే బాగుండదు. పార్టీలు పెట్టాల. య్యెస్సయి అమీరు సాహేబును మరవకుండా వుంటే యింకా యిట్లాంటి కేసులు మనకు వచ్చేట్టు చూస్తాడు. యీ కేసును నడిపేదంటే యేనుగుల్ని మేపినట్టే! కోర్టులో ఖర్చులకూ,

రకరకాల ఫీజులకూ వేలకు వేలు ఖర్చుపెట్టాల. పదికీ యిర్వైకీ తటపటాయించకూడదు. ఆర్డర్లొచ్చినాక ఆదాయం గూడా దండిగానే వుంటాదిలే...''

''యెప్పుడో వస్తుంది. నిజమే! యిప్పుడు పెట్టుబడికి వేలల్లో దుడ్డెక్కడి నుంచి పుట్టించేదీ!''

''మీ నాయన్నడుగు...''

''పోయిన సమత్సరంలో సీనియరు హైదరాబాదుకు పోయిరమ్మన్నప్పుడు మా నాయిన దగ్గిర రెండువేలు తీసుకున్నాను. దాన్నే యింకా తిరిగియ్యలేదు. పైగా మనమేందో బాగా సంపాయిస్తా వుండామని ఆయననుకుంటా వుండాడు. యిప్పుడు దుడ్డడిగితే మన ప్రిస్టేజీ యేమయితింది? మా నాయన్నీ, మా అన్నల్నీ అడిగేది నాకిష్టం లేదు. అడిగితే యింట్లో అందురూ నా మాటంటే లెక్కబెట్టేది కూడా మానేస్తారు. కావాలంటే అప్పయినా చేస్తాను...''

''ఆ మాట చెప్పు. అప్పు తీసుకునేది పెద్దపని గాదులే! బాంకీ మేనేజర్ను కదపదాం. ఆయన వొప్పుకోకపోతే మన రమేషుండనే వుండాడు. మూడు రూపాయల వడ్డీ యెక్కువేననుకో. కానీ, డిక్రీ అయినాక యిదొక లెక్కలో వుండేది గాదు...''

''వచ్చే యిరవయ్యయిదులో యింత ఖర్చు పెట్టేస్తే మనకు మిగిలేదేముంది?''

''మనీ సాంక్షనయినాక ఫీజుగాకుండా, ఖర్చులకు పెట్టిన దుడ్డు తనీగా అడిగి తీసుకుందాం. అప్పుడు పార్టీ వొద్దంటాడా యేమయినానా?'' కోదండం నవ్వసాగాడు. ''పైగా మనం యెనభై అయిదునుంచీ క్లయించేస్తాం. వడ్డీగా పెద్దమొత్తమే సాంక్షనయితింది. దుడ్డు నేరుగా క్లయింటు పేరుతో వుండే బాంకు అకౌంటుకు పోతింది. ఆ పాస్‌బుక్కేమో మన చేతిలో వుంటింది. పార్టీ పట్టించుకోకపోతే, మామూలుగా వడ్డీ దుడ్డంతా లాయరే తీసుకుంటాడు. యీ కేసుల్లో ఖర్చొ యెక్కువే, ఆదాయమూ యెక్కువే అని చెప్పినాను గదా...''

సుబ్రమణ్యం మనసులోనే లెక్కలుగట్టి ''ఫీజు పదికి బదులుగా పదయిదు పర్సెంటయినా తీసుకుంటే బాగుండును. స్కూటరైనా కొనుక్కోలేదని మా అమ్మ గొనగతా వుంది. పైగా బండుంటే మంచి సంబంధాలు గూడా వస్తాయి'' అన్నాడు.

''ముందు ఆర్డరు రానీ! తర్వాత యెట్ల మేనేజ్ చేస్తానో చూద్దువుగానీ'' అని రెండు నిమిషాల తర్వాత ''బండి నువ్వే కొనాల్నా? పెండ్లి కూతురితో బాటూ యింటికిరాదా?'' అని కిసుక్కున నవ్వేశాడు కోదండం.

''మా కాస్ట్‌లో అంతగా కట్నాలిచ్చేవాళ్లెవరు?'' సుబ్రమణ్యం పెద్దగా నిట్టూర్చాడు. ''వాళ్లిచ్చే దుడ్డు వాళ్లమ్మాయికి నగలేసేదానికే సరిపోతింది. అసలు యే రకంగా చూసినా హైకాస్టోళ్ల పనే బాగుంది కోదండం! కేసులు గూడా యే కాస్టోళ్లు ఆ కాస్టోళ్ల దగ్గిరికే తీసుకొని పోతారు. మన కాస్టోళ్లు గూడా లీడింగు లాయర్లని వాళ్ల దగ్గిరికే పోతారు. అన్ని పక్కలనుంచీ మనకే దెబ్బ....''

రెండువైపులా యెత్తుగా వేసిన ముళ్లకంచెల మధ్య, యిసుక మేటవేసినట్టున్న మట్టి బాటలో వాహనం మెల్లగా సాగింది. మిట్ట మధ్యాహ్నపు యెండలో కంచెకవతలి మామిడి చెట్లల్లోంచీ వేడిగాలి సుళ్లు తిరుగుతోంది. వాహనం చెరువుగట్టు పైకి రాగానే దూరంగా కొండకింద వొకేరకమైన వాస్తు పద్ధతిలో నిర్మించిన చిన్న చిన్న మిద్దె యిండ్లు కనిపించాయి. కేసు సంగతి స్ఫురించగానే సుబ్రమణ్యం ''యీ పెద్ద పీరా సాయిబు షేకా, దూదేకలా?'' అన్న సందేహాన్ని వెలిబుచ్చాడు.

''దూదేకులోళ్లే ఆ పేరెక్కువగా పెట్టుకుంటారు. వీళ్లసలు అవతల అనంతపురం జిల్లాలో అయితే హిందువులుగానే లెక్క. కొన్నిచోట్ల ముస్లిములుగానూ, యింకొన్ని చోట్లల్లో హిందువులుగానూ చలామణీ అవతార్లే! బీసీలే! చిన్న చిన్న యాపారాలు చేస్తారు. కూలీనాలికి పోతారు..''

కోదండం మాట్లాడుతూ వుండగానే వాహనం యిళ్లమధ్య కొచ్చేసింది.

చిన్న వరండా, వొక చిన్న గది, చిన్న వంటిల్లు. యిద్దరు మనుషులకైతే సరిపోయే టట్టుగానూ, ముగ్గురికయితే చిన్నదిగానూ కనిపిస్తున్న యిండ్లు. పలచటి సున్నపు పూతతో రక్తహీనతతో చిక్కి శల్యమైపోయిన క్షయరోగుల ముఖాల్లా వెలవెలబోతున్నాయవి. యెండా వానల్లో తలదాచుకోవడానికి తప్పితే మిగిలిన సమయాల్లో కాపురాలన్నీ యిళ్ల బయటే సాగుతుండటం చేత, యిండ్లచుట్టూ రకరకాల సామాన్లు కనిపిస్తున్నాయి. చిన్న చిన్న పిచ్చి మొక్కల్ని మినహాయిస్తే పెద్ద చెట్టేదీ చుట్టుపక్కలెక్కడా కనిపించడం లేదు.

వాహనమొచ్చి ఆగగానే యిద్దరు ముగ్గురు పిల్లలు బిలబిలమంటూ పరిగెత్తుకొచ్చారు. కొందరు పిల్లల్నీ, కొందరు పెద్దవాళ్లనీ వాకబు చేసిన తర్వాత, దస్తగిరి యిల్లేదో తెలిసింది. యింటి వరండా దగ్గరికొచ్చి నిల్చున్నారిద్దరూ.

వోరగా వేసిన వాకిలిలోంచీ యింటిలో యెవరున్నారో తెలియడం లేదు. విరిగిపోయిన సిమెంటు కిటికీలోంచీ పాత చీరతో కట్టిన వుయ్యాల మాత్రం కనబడుతోంది. తాళ్లు తెగిన నులకమంచమొకటి యేదో వింత జంతువు తాలూకు అస్థిపంజరంలా చేరగిలబడి వుంది.

కోధండం శబ్దమయ్యేలా తలుపుతోసి ''దస్తగిరీ'' అని కేకేశాడు.

లోపల చాపపైన యిద్దరు చిన్నపిల్లల మధ్య పడుకున్న స్త్రీ వులిక్కిపడి లేచి నిల్చుంది. సుబ్రమణ్యం కళ్లు పెద్దవి చేసుకుని ముందుకడుగేశాడు. జారుతున్న వెలిసిన ఆకుపచ్చ చీరను సర్దుకుంటూ, తడబడుతూ, ముందుకొచ్చిన పొడవాటి ఆమె శరీరాన్ని చూడగానే కోర్టు కాంపౌండులో అత్తిచెట్టూ, చుట్టూ గుండ్రటి ఆకుపచ్చ కాయల్ని కాసే సన్నటి అత్తి కొమ్మలూ జ్ఞాపకం వచ్చాయి సుబ్రమణ్యానికి.

యెండిన పెదవుల్ని నాలుకతో తడుపుకుని, మాట్లడటానికి ప్రయత్నించా డతను. కానీ, నోరు పెగల్లేదు.

''దస్తగిరి లేడా?'' కోదండం ప్రశ్నించాడు.

''వుండాడు'' అంది ఆమె.

''యెక్కడ?''

ఆమె అటూ యిటూ కళ్లు తిప్పింది.

''కొంచెం పిలిపించు. మేము కోర్టునించీ వచ్చినాం. పనుండాది...''

ఆమె లోపలికి తొంగిచూసి, పిల్లలిద్దరూ నిద్రపోతున్నారని గమనించి, తలుపు వోరగా మూసి, ''పిలిచేసొస్తాను'' అంటూ వీధిలోకి వెళ్లిపోయింది.

కూచునే స్థలం కోసం చుట్టూ కలయజూసి, యెక్కడా కనిపించకపోవడంతో, సుబ్రమణ్యం స్టాండేసిన మోటార్ బైకు పైన్నే కూర్చున్నాడు. ''పెళ్లయిపోయిన వ్యక్తి డిపెండెంటు కాదు గదా! యింక వీళ్లతో మనకేం పని'' అన్న ప్రశ్న అతడి పెదవుల్లోంచి తడబడుతూ ముందుకు దుమికింది.

వరండాలోని కుక్కితట్టని పక్కకు జరిపి, మురికి డాగుల్లోనే సర్దుకుని కూర్చుంటూ ''డిపెండెంట్లెంత యెక్కువమందుంటే అంత కాంపన్సేషన్ సాంక్షనయితింది. ముందుండిన లాయరు యీమెను గూడా డిపెండెంటుగా చేర్చి వుంటాడు. కాబట్టి వొకటి రెండు సార్లు కోర్టుకాడి దాంకా పొయెయ్యేచ్చుంటుందీమె కూడా! రికార్డుల్లోకి పేరెక్కే వుంటుంది. యింతదూరం వచ్చినాం కదా! వివరాలు తెలుసుకోని పోతే వొక పనయినట్టవుతుంది'' అన్నాడు కోదండం.

''దూదేకుల సాయిబుల్లో యీ మాదిరిగా ఆడపిల్లకు రెండో పెళ్లి చేసే అలవాటుందా?'' సుబ్రమణ్యం మరో ప్రశ్నని సంధించాడు.

అనవసరమైన ప్రశ్నల్తో యిబ్బంది పెట్టే చిన్న కుర్రాణ్ణి చూసినట్టుగా విసుగ్గా వో చూపు చూసి, ''బాగా బీదోళ్లల్లోనూ, పెద్ద ధనవంతుల్లోనూ ఆడపిల్లకు అవసరమైతే రెండో పెండ్లిగూడా చేస్తారు. నడిమధ్య వుండే మన మిడిల్ క్లాసోళ్లు మాత్రం అట్లంతా వొప్పుకోరు'' అన్నాడు కోదండం.

అయిదు నిమిషాలు వేచి చూసిన తర్వాత చేతి గడియారం కేసి చూసి ''అప్పుడే రెండున్నరయింది. యీ మాదిరైతే అయిదుకైనా యింటికి పోతామో పోమో! సాయంత్రం యింటికి బంధువులొస్తారనీ, తొందరగా రమ్మనీ చెప్పింది అమ్మ'' అన్నాడు సుబ్రమణ్యం పలవరిస్తున్నట్టుగా.

''యేదైనా పెళ్లి సంబంధమా?'' కోదండం కళ్లెగరేశాడు.

''అట్లాంటిదే! కానీ, యేం లాభం? సంపాయించి సాకతాననే నమ్మకం దొరికేదాకా పెళ్ళొద్దనేస్తా వుండాడుకదా మా నాయన. యెట్లయినాతొందరగా స్కూటర్ కొనుక్కోవాల కోదండం. యింట్లో అందరికీ మనమంటే కనాకష్టంగా వుంది...'' చెబుతానే మోటార్‌బైకు టాంకు తీసిచూసి, వాహనాన్నొకసారి అటూ యిటూ వూపి చూసి ''గోయింద... పెట్రోలు అడుగంటేసింది. వూరుచేరతామనే నమ్మకం లేదు'' అన్నాడతను.

కోదండం వీధివైపుకు తిరిగి ''యీా హుస్సేనమ్మ చేతులూపుకుంటూ వస్తావుందే! ఆ దస్తగిరి కొంపదీసి యెక్కడికైనా చెక్కేసినాడా'' అని ముఖం చిట్లించుకున్నాడు

సుబ్రమణ్యం గబగబా నడుస్తున్న ఆమెని పరీక్షించి చూసి ''అబ్బ యెంత పొడుగుంది కోదండం ఆమె'' అని ఆశ్చర్యపడసాగాడు.

కళ్లార్పకుండా ఆమెనే గమనిస్తున్న కుర్రలాయర్ని చూసి, కోదండం ముసిముసి నవ్వులు నవ్వసాగాడు.

దగ్గరికి వచ్చిన తర్వాత ''యిప్పుడే వస్తానన్నాడు'' అని చెప్పి హడావుడిగా యింటి లోపలికెళ్లి కదులుతున్న వుయ్యాలని పట్టుకుని వూపసాగింది ఆమె.

కోదండం సిగరెట్టు వెలిగించాడు. సుబ్రమణ్యం జేబులోంచీ వక్కపొడి పొట్లం తీసి కొద్దిగా నోట్లో వేసుకుని నమలసాగాడు.

కోదండం రెండో సిగరెట్టును రగిలించాకగానీ, దస్తగిరి రోడ్డుపైన ప్రత్యక్షమవలేదు. ముందుగా ఘాటయిన వాసన ముక్కుపుటాలని తాకింది. తరువాత అతనొచ్చి ముందు నిల్చున్నాడు.

పట్టించుకోకపోవడం చేత బోదగడ్డిలా విచ్చలవిడిగా పెరిగిన పుల్లటి వెంట్రుకలు, నడిచీ నడిచీ గడ్డి పెరగడం తగ్గిపోయిన పొలం గట్ల లాంటి కనుబొమలు, పొగ తాగీ తాగీ యెర్రబారిన పెదవులు, నల్లబారిన పళ్ళు - నెగటివ్ ఫోటోలోని వ్యక్తికి జీవమొచ్చి నడిచొచ్చినట్టుగా కనిపిస్తున్నాడతను.

అతడినోసారి యెగాదిగా చూసి, ''దస్తగిరి అంటే నువ్వేనా?'' అని అడిగాడు సుబ్రమణ్యం.

అతను తల వూపాడు.

''దస్తగిరీ! పొద్దన్నించీ యీా పనిమీదే తిరగతా వుండావు. బిన్నాగా యింటికి చేరుకోవాల మేము. పనేమో చెప్పేస్తాను. జాగ్రత్తగా విను'' అంటూ నేరుగా విషయంలోకి దిగేశాడు కోదండం. ''యీాయన లాయరు. పేరు సుబ్రమణ్యం. వో కేసు పనిపైన నీ దగ్గరకొచ్చినావు. పెద్ద పీరా సాయిబు కొడుకు చచ్చిపోయి దగ్గిర దగ్గిర తొమ్మిదేండ్లవుతావుంది. చచ్చిపోయిన కొత్తలో యిన్స్రెన్సుకని కోర్టుకు పోయినారు. ఆ లాయరు యిట్లాంటి చిన్న కేసుల్ని పట్టించుకునే వాడు కాదు. కేసు కొట్టేసినారు. యిప్పుడు మా లాయరు మళ్లా అప్పీలు చేస్తావుండాడు. అప్పుడు అప్లయి చేసిన వకాలత్తులో నీ భార్య గూడా డిపెండెంటని రాసుంటారు. యిప్పుడు కాదు. కాబట్టి మీకు పెళ్లయినట్టుగా కోర్టుకు రుజువు చూపించాల. అదీ పని. కావాల్సిన కాగితాలేవో మేము పుట్టించుకుంటాం. అవసరమైతే మీరు కోర్టుకు రావాల''

చేతిలోని బీడీ పూర్తవగానే వీధిలోకి విసిరి పారేసి, మరో బీడీ వెలిగించుకుని, ''యీా కోర్టు యవహారాలు నాకు గూడా కొంచెం తెలుసు సార్! మా వూర్లో దొమ్మి జరిగినప్పుడు

కోర్టుకు తిరిగీ తిరిగీ నా చెప్పులే అరిగి పోయినాయి. అదంతా యిప్పుడెందుకుగానీ జరిగే పని చూద్దాం. కోర్టుకొస్తే నాకెంతిస్తారు'' అని అడిగాడు దస్తగిరి.

''చార్జీలకిస్తాను. పనులొదిలి పెట్టుకొని వచ్చినందుకు న్యాయంగా యెంతియ్యచ్చునో అంత దుడ్డిస్తాను'' సమాధానం చెప్పాడు సుబ్రమణ్యం.

''యిట్లాంటి కేసొకటి యేసినారని నాకు తెలియనే తెలియదు సార్! తెలిసుంటే పెద్ద పీరా సాయిబు దగ్గరికిపోయి నిలదీసుందును. పోనీలే గానీ యీ కేసు గెలిస్తే పీరాసాయిబు కెంతొస్తింది? దాంతో నా భాగమెంత? అది తేల్చండి ముందు'' అన్నాడతను మళ్లీ.

సుబ్రమణ్యం నిర్ఘాంతపడిపోయాడు. ''దాంట్లో నీకు షేరెట్ల వస్తాది? మీకు పెండ్లయిపోయింది. నీ భార్యిప్పుడు వాళ్లపైన ఆధారపడి లేదు. అది గుర్తుపెట్టుకో''

''అదంతా నాకెందుకు సార్? కోర్టుకు రమ్మంటా వుండారు మీరు. వస్తే నాకెంత యిస్తారు?'' అదే మాటల్ని మళ్లీ వల్లించాడతను.

కోదండం కాసేపు అతనివాంకే చూసి, తర్వాత పైకి లేచి నిల్చున్నాడు. ''యేందో న్యాయంగా అడగాల గదా అని వచ్చినాము. నువ్విట్ల రూళ్లు మాట్లాడితే లాభం లేదు. హుసేనమ్మకు పెండ్లయినట్టుగా యెట్ల రుజువు చెయ్యాలో మాకు బాగా తెలుసు...'' అన్నాడు కత్తితో నరికినంత ఖచ్చితంగా...

''మీకంత కోపం వస్తే యెట్లాసార్?'' దస్తగిరి కంఠంలో మునుపున్న కాఠిన్యం వొక్కసారిగా కరిగిపోయింది. ''మీరు ఆఫీసర్లు. మేము యేమీ తెలియనోళ్లం. మీరు చెప్పాల. మేము వినాల. వినకపోతే అప్పుడు మీ యెడంకాలి చెప్పుతో కొట్టండి. నేను మాటంటే మాటే! మీతో చెప్పేదానికి సిగ్గెందుకులెండి? మాది యీ యిలాకా గాదు. కడప జిల్లాలో ముద్దనూరు దగ్గిర కొత్తపల్లె. అదిస్తాము యిదిస్తాము అని వీళ్ల అన్న మాకు ఆశ జూపించి నిఖా చెయ్యించినాడు. రెండు బోకుల్తో, మూడు గుడ్డ పేలికల్తో కాపరాని కొచ్చిందది. కట్టుకున్నాక తప్పితిందా? యీ పక్క యాపారాలు అంతగా అచ్చిరావు. అయినా, యిట్ల ప్రాకలాడతావుండాను. ముగ్గురు బిడ్డలయినారు. మీరు చెప్పినట్టే చేస్తాను. కొంచెం షేరు నాకు గూడా వచ్చేటట్టు చూడండి. మీకు ఫీజెంత కావాలంటే అంత యిస్తాను''

కోదండం చిరునవ్వు నవ్వుతూ కూర్చున్నాడు. సుబ్రమణ్యం కేసి చూసి కళ్ళెగరేసి ''అట్లా అడుగు చెప్తాను. దీనికో అయిడియా వేసినాను. డిపెండెంటుగా నీ పెండ్లాన్ని గూడా లిస్టులో చేర్పించేస్తాను. సాంక్షనయిన దుడ్డులో న్యాయమైన షేరిప్పిస్తాను. అయితే వొకటి. కోర్టుకు రమ్మనప్పుడు రావాల. వచ్చేటప్పుడు ఆ నల్లపూసలూ, మెట్టెలూ తీసేసి రావాల. పెండ్లయినట్టు చెప్పగూడదు. పీరా సాయిబును కూడా దీనికొప్పిస్తాను. ముందే చెప్తావుండాను. మధ్యలో ప్లేటు ఫిరాయిస్తే మొదటికే మోసం వస్తాది. కానీ, గెలిస్తే బాగా ముట్టతాది'' అన్నాడు.

ఆరిపోబోయిన బీడీతో మరో కొత్త బీడీ అంటించుకుంటూ ''పనయినాంక నా షేరు

నాకిచ్చేస్తారు కదా సార్!'' అని సందేహిస్తూ అడిగాడు దస్తగిరి.

''చూడు దస్తగిరీ! యిది నమ్మకంపైన జరగాల్సిన పని. నమ్మితే చెడేదేం లేదు. ఆలోచించుకో... ముందు కొంచెం నీళ్లు తెప్పించు. దాహంగా వుండాది''

దస్తగిరి పరుగే నడకగా యింటిలోకెళ్లి పెద్ద చెంబుతో నీళ్లు తీసుకొచ్చాడు. కోదండం తాగుతూ వుండగా ''యేటిగట్టు దగ్గర టెంకాయ చెట్లుండాయి సార్! కావిలోన్నడిగి రెండు యెర్నీళ్ల టెంకాయలు తెచ్చేదా'' అని వినయంగా అడిగాడు.

''టెంకాయలెట్టయినా పోనీ! యీ పక్క యిండ్లల్లో యెక్కడైనా కొంచెం పెట్రోలు దొరుకుతుందేమో చూడు దస్తగిరీ! బండిలో పెట్రోలయిపోయింది. యింటికి చేరాలంటే ఆయిలు కావాల్సిందే!'' సుబ్రమణ్యం కంగారుపడుతూ అడిగాడు.

''పెట్రోలిక్కడెక్కడ దొరికితింది సార్!'' దస్తగిరి నవ్వేశాడు. ''యీ పక్కవురికి బండ్లు లేవు''

''కిరసనాయిలైనా దొరకదా దస్తగిరీ?'' కోదండం నీళ్ల చెంబు పక్కన పెడుతూ వాకబు చేశాడు.

''దొరకచ్చు సార్. ఆ పక్క చిన్నబ్బోళ్ల యింట్లో రేషనిస్తారు. అక్కడ దొరకచ్చు...''

కోదండం వకాలత్తు కాగితాన్ని సుబ్రమణ్యం చేతికిచ్చి, ''హుస్సేనమ్మ దగ్గిర సైన్ చెయ్యించు. కిరసనాయిలుతో బండిని నడపక తప్పదు. నేనూ దస్తగిరీ అట్ల పోయొస్తాం. వీలయితే దస్తగిరిని యెర్నీళ్ల టెంకాయలు తెమ్మంటాను'' అని ముందుకు కదిలాడు.

''సార్ చెప్పినచోట దస్కతు చెయ్యి'' అని బయటినుంచే భార్యకు హుకుం జారీచేసిన తర్వాత దస్తగిరి కూడా కోదండాన్ని అనుసరించాడు. చాలాకాలంగా స్నేహం వున్న మిత్రుల్లా యిద్దరూ మాట్లాడుకుంటూ వీధి చివరికెళ్లి మలుపు తిరిగి మాయమైపోయారు.

వకాలత్ కాగితంతోనే విసురుకుంటూ యింటిలోకి తొంగి చూశాడు సుబ్రమణ్యం. చాపపైన పడుకున్న పిల్లల్లో పెద్దదిగా కనిపిస్తున్న అమ్మాయి నిద్రలోనే నవ్వుకుంటోంది. వుయ్యాల్లోని పాపాయి మెల్లగా రాగాలాపన మొదలుపెట్టింది. హుస్సేనమ్మ వుయ్యాల వూపుతోంది.

కొండవాలులో వరుసగా కట్టిన యిండ్లు యెండ తాకిడికి శోషొచ్చి పడిపోయిన కొంగల గుంపులా కనిపిస్తున్నాయి. వీదిలో యేదో పదార్థాన్ని నోట కరచుకుని పరిగెడుతున్న యెర్రటి కుక్కపిల్లని నల్లటి కుక్కొక్కటి తరుముతోంది. అవతలివైపున యింటిలో బాగా చిక్కి వగ్గయిపోయిన ముసలావిడ యీత విసనకర్రతో విసురుకుంటోంది. దూరంగా కొండ దగ్గర సుడిగాలి వేగంగా సుళ్లు తిరుగుతోంది.

కాస్సేపు వేచి చూసిన తర్వాత ''సైను చేస్తావా? లేక వేలిముద్రా'' అని వీలయినంతగా గొంతు పెంచి అడిగాడు సుబ్రమణ్యం. కాస్సేపు సమాధానమేమీ వెలువడలేదు. రెండు

మూడు నిమిషాల తర్వాత ''అయిదు దాంకా చదివినాను'' అన్న మాట వినిపించింది.

''యీ కేసు పనిపైన యెప్పుడైనా కోర్టుకొచ్చినావా నువ్వు?''

''రొండుసార్లు''

''నీకు పెళ్లయినాంక యెవురూ యీ పనిమీద నిన్ను కలవలేదా''

''లేదు''

లోపలినుంచీ మాటలు మాత్రం ప్రసారమవుతున్నాయి. ఆమెను బయటికి రప్పించడం కోసం ''కొంచెం నీళ్లు కావాలి. దాహంగా వుంది'' అన్నాడతను.

వుయ్యాల్లోని బిడ్డ కదలడం మానిన తర్వాత ఆమె నీళ్ల చెంబుతో బయటికొచ్చింది. గుడ్డును పగులగొట్టుకుని బయటికొచ్చే కోడిపిల్లలా బట్టల్లోంచి ఆమె శరీరం స్వేచ్ఛను పొందడం కోసం పోరాటం సల్పుతున్నట్టుగా అనిపించడంతో సుబ్రమణ్యం బెంబేలు పడసాగాడు. నీళ్ల గ్లాసుతో బాటూ ఆమె వేళ్లు చేతికి తగలగానే కాస్సేపు వేగంగా గుండె కొట్టుకోవడం మొదలెట్టిందతడికి. చిన్న పిల్లాడిని చూసినట్టుగా అతడినోసారి చూసి చిరునవ్వు నవ్వుతూ గోడపక్కకెళ్లి నిల్చుందామె.

''యెందురు బిడ్డలు? ముగ్గురేనా?'' తన గొంతు తనకే వింతగా వినబడుతుండగా అతడడిగాడు.

ఆమె తల వూపింది.

''ఆపరేషన్ చేయించుకోలేదా?''

తల అడ్డంగా వూపిందామె.

''లావైపోతావని భయమా?''

ఆమె పెదవులు సాగదీసింది.

''కోర్టుకు రావాల్సి వుంటింది. వొంటిగా వస్తావా, మీ ఆయనతో వస్తావా?...''

''రావాల్సిన పనుంటే యిద్దురుమూ వస్తాము''

''నిన్ను వొంటిగా పంపిస్తాడా మీ ఆయన...''

ఆమె తల వూపింది మళ్లీ.

అయిదు నిముషాలు యిద్దరూ మాట్లాడుకోలేదు. తరువాత ఆమె మెల్లగా ''మాకు దుడ్డెంత రావచ్చు సార్!'' అని అడిగింది.

వూహించని ప్రశ్నకు సమాధానమెలా చెప్పాలో తోచక తడబడుతూ ''యెంతంటే... యిప్పుడే చెప్పలేము. రెండు లక్షలకు అప్లయి చేస్తాను. సాక్షనయిందాంట్లో పెద్ద పీరా సాయిబుకూ, మీకూ భాగాలే రకంగా చెయ్యాల్నో యింకా అనుకోలేదు'' అని చెప్పాడు.

''నాకో సహాయం చెయ్యి సార్! మా దుడ్డు నా చేతికే యియ్యి. మా ఆయన దగ్గిర యియ్యొద్దు...'' ఆమె నెమ్మదిగా అంది.

రెండు నిమిషాలు ఆలోచించి, తర్వాత నవ్వేస్తూ, ''యెందుకు? మీ ఆయన పాడు చేస్తాడని భయమా'' అని ప్రశ్నించాడు.

''పాడు చేసేదాంట్లో ఆయనకు చెప్పాల్సిన పనే లేదు. పొద్దస్తమానమూ ఆ మూలింట్లో - యీడ కొన్ని యిండ్లు ఖాళీగానే పడుండాయిలే! యీ అడివిలోకెవురొచ్చి అగోరిస్తారు? ఆ యింట్లో యిస్పెట్టాకులాడతా వుంటాడు. చాలని దానికి యింకో కొంపలో సారాయి గూడా అమ్మతారు. యీ మనిషెప్పుడూ అక్కడ్నే తారకలాడతా వుంటాడు. అయినా యే మాట కామాటే చెప్పాల సార్! పనుల కాలంలో వొళ్లు దగ్గర పెట్టుకోని పని చేస్తాడు. యీ పక్క యిలాకాలో మా యజమానుడి మాదిరిగా చింతగింజల యాపారం చేసే మనిషి యింకొకడు లేడు. పని చెయ్యకుంటే సంసారం గడిస్తిందా?'' ఆమె నవ్వుతూనే వుంది.

''అయితే, నీకు ప్రత్యేకంగా డబ్బెందుకు? బంగారు నగలేమైనా చేయించుకోవాల్నా?''

''రెండు మూడు సవరాల్తో నల్లపూసలదండ చెయ్యించుకోవాలని చానా దినాలుగా అనుకుంటా వుండాను. నా పేరుమీంద కొంచెం దుడ్డు బాంకిలో పెట్టుకోవాలని గూడా వుంది. వొట్టి చేతుల్తో సంసారానికొచ్చినానని మా యజమానుడికి నేనంటే భలే అలుసు. మన చేతిలో రెండు రూకలుంటేనే మనం గూడా అందురి కండ్లకూ మనిషిగా కనబడతాము. లేకపోతే లెక్క వుండదు...''

''బ్యాంకులో వూరికే దుడ్డుంటే లాభమేముంది? వాళ్లిచ్చే వడ్డీ చానా తక్కువ. అంతకంటే యేదైనా వ్యాపారంలో పెడితే యెక్కువ దుడ్డు సంపాయించవచ్చు...''

''ఆడ మనిషిని, నేనేం యాపారం చేస్తాన్లే సార్! నా పేరుమీద దుడ్డుంటే ధయిర్నంగా వుంటింది. మొగుడు పతింపుగా చూస్తాడు. చుట్టపక్కాలు ప్రియంగా పలకరిస్తారు. అవసరమొచ్చినప్పుడు వుపయోగించుకోకపోయినా పర్వాలేదుగానీ బాంకిలో దుడ్డుంటే చ ఖు! కువాయిట్‌కు పోయొచ్చిన మా పిన్నమ్మను చూస్తే అందుకే అందురూ మతింపుగా చూస్తావుండారు . నాకు తెలుసు...''

మాట్లాడటానికి ప్రశ్నేదీ తోచక కాస్సేపు ఆలోచించి చివరికి ''మీ అమ్మగారి వూరేది'' అని అడిగాడతను.

''మిట్టూరు. క్రాసునుంచీ నాలుగు మైళ్లు. మా అన్నోళ్లది పెద్ద యాపారం. చింతచెట్లు, మామిడి తోటలూ కొంటాడు...'' వీధి మలుపులో కోదండంతో బాటూ దస్తగిరి ప్రత్యక్షం కావడంతో ఆమె టక్కున మాట్లాడటం మానేసింది. సుబ్రమణ్యం కూడా కర్తవ్యాన్ని జ్ఞాపకం చేసుకుని 'నువ్వు సైను చెయ్యనే లేదు' అంటూ వకాలత్ కాగితాన్ని నేలపైన పరిచాడు.. ఆమె ముందుకొచ్చి నేలపైన కూర్చుని, వంగి అదొక హేలగా అతను చూపించిన చోట పెద్ద పెద్ద అక్షరాలతో సంతకం చేసింది. తరువాతోసారి అతడివైపుకు చూసి అదోలా నవ్వి లోనికెళ్లిపోయింది.

''రెండు లీటర్ల కిరసనాయిలు దొరికింది. మన దస్తగిరే దుడ్డిచ్చేసినాడు'' అంటూ అట్టహాసంగా వచ్చేశాడు కోదండం.

సుబ్రమణ్యం వాహనం టాంకు మూతను బలంగా వూడదీశాడు. దస్తగిరి టాంకులోకి కిరసనాయిలు నింపాడు.

''దస్తగిరి టెంకాయలు తెస్తానన్నాడు. టయిం లేదని నేనే వద్దన్నాను. యింక స్టాండు తియ్యి. బిన్నా బయల్దేరితే సాయింత్రానికైనా యింటికి చేరచ్చు'' అన్నాడు కోదండం.

కిరసనాయిలు పోయడంచేత పదిహేను నిమిషాల సేపు కిక్కర్‌తో తంటాల పడ్డాకగానీ వాహనం కదల్లేదు. వెనుకసీటు పైన కూర్చుంటూ కోదండం యేదో బిగ్గరగా గొంతు చించుకుంటున్నాడు. తనకేదో అర్థమయినట్టుగా దస్తగిరి తల వూపుతున్నాడు. వొళ్లంతా చెమటలు పోసి బట్టలు తడిసిపోతుండగా, కారుబారు చేస్తున్న వాహనాన్ని ముందుకు కదిపాడు సుబ్రమణ్యం.

కోదండం దగ్గరగా జరిగి కూర్చున్న తర్వాత కిరోసిన్‌తో బాటూ ఘాటయిన మరో వాసన తోడయినట్టుగా స్ఫురించడంతో ''బండెక్కిసినావా కోదండం?'' అంటూ సుబ్రమణ్యం విసుక్కున్నాడు.

''యేం చేసేది? దస్తగిరి వొదిలిపెట్టనే లేదు'' అని కిసుక్కుమని నవ్వసాగా డతను. ''ఈ అరేంజిమెంటుకు దస్తగిరి వొప్పుకున్నాడు. కాబట్టి కొత్తగా మళ్లీ తొలినుంచీ మొదలు పెట్టాల్సిన పని తప్పోయింది. లేకపోతే పెద్ద హరారత్తయిపోయి వుండును. అయినా అప్పుడే యేమయిందిలే! దుడ్డు సాంక్షనయ్యేదాకా పని పూర్తయినట్టు కాదు. వకాలత్తు దాఖలు చేసినాక ముందుండిన లాయరు మన పైకి రావచ్చు. కొంచెం షేరియ్యాల్సి రావచ్చు. దోవల్లో యెదురయ్యే గంగమ్మలకంతా తృప్తి చెయ్యాల్సి వస్తింది. అది సరే గానీ, ఆఫీసు నుంచీ నేరుగ యిట్లే వచ్చేసినాను. యింట్లో చెప్పేసయినా రాలేదు. ఆదివారం గదా! మాంసం తెస్తానని యింట్లో యింకా యెదురుచూస్తానే వుంటారు. యీ పనులన్నీ పక్కన పెట్టేసి వచ్చినాను కదా! నాకెంత షేరిస్తావో నోరు తెరిచి చెప్పినావా సుబ్రమణ్యం నువ్వు! నువ్వేమయినా తక్కువ తిన్నావా? రెండేండ్లలో మన సీనియర్ని మింగేసేటట్టుగా వుండావు''... డబ్బారేకుపైన రాళ్లు దొర్లించినట్టుగా ధ్వనిస్తున్న గొంతుకతో కోదండం నవ్వసాగాడు.

మండిపడుతున్న యెండలో చెట్లుగూడా వడదెబ్బ తగిలినట్లు నిశ్చేష్టంగా కనిపిస్తున్నాయి. కనుచూపు మేరలో పక్షులు గూడా కనిపించడం లేదు. దారంతా నిర్మానుష్యంగా వుంది.

వాహనం మరో కిలోమీటరు పరిగెత్తిన తర్వాత ''వడ్డీ రూపంలో సువారుగానే దుడ్డొస్తాదనుకో! కానీ, పార్టీ దగ్గిర యిరవయ్యయిదు పర్సెంటు అడగాలిసిందే కోదండం. లేకపోతే వర్కవుట్ అయ్యేటట్టుగా లేదు'' అని రెండు నిమిషాలాగి ''అవునుగానీ, డిసీస్డ్ పర్సన్, పెద్ద పీరా సాయిబు కొడుకు, అదే హుసేనమ్మ మొదుటి మొగుడు... వాని పేరేందో అడిగి నోట్ చేసుకోనే లేదు. పిటీషన్‌లో రాయలగదా! పాత రికార్డులు వెతికి కనిపెట్టాల్సిందేనా!'' అంటూ పెదవులు చప్పరించాడు సుబ్రమణ్యం.

కాస్సేపాగి ''హుస్సేనమ్మ నాకంటే పొడుగ్గా వుంటుందా కోదండం'' అని మరో ప్రశ్నను

ప్రసారం చేశాడు.

వాలిపోతున్న కనురెప్పల్ని బలవంతంగా పైకెత్తి, అతడి ప్రశ్నను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ''నీ వయసెంతయి వుంటింది? ముప్పయి దాటిందా'' అని అడిగాడతను.

సుబ్రమణ్యం జవాబు చెప్పలేదు.

''ప్చ్... ప్చ్... నీ వొయసుకంతా నాకిద్దురు బిడ్డలు గూడా వుండిరి. నీకంటే హుసేనమ్మ మేలు. నీకంటే కనీసం రెండు మూడేండ్లయినా చిన్నదిగా వుంటింది. దానికిప్పుటికే రెండు పెండ్లిండ్లయినాయి. నీకింకా వొకదానికి గూడా గతి లేదు...'' అని గొణిగాడు కోదండం.

కిరసనాయిలుతో స్నేహం కుదుర్చుకోలేక మోటార్ బైకు భీకరంగా గొంతు చించుకుంటూ నల్లటి పొగని వెలుపలికి నెట్టుతోంది. కడుపులో రకరకాల జంతువులు పరిగెడుతున్నట్టుగా తోచడంతో కోదండం గట్టిగా కళ్లు మూసుకున్నాడు. హుస్సేనమ్మ ఆకారం కళ్లముందు కదలాడటంతో సుబ్రమణ్యం వాహనాన్ని జోరుగా పరిగెత్తించసాగాడు.

*(యిండియా టుడే : 6 - 21 డిసెంబర్ '94*
*21 డిసెంబర్ '94 - 5 జనవరి '95)*